

# కథా కౌముది

## తల్లికాకి - పిల్లకాకి

చిలుకూరి సత్యదేవ్,Houston,TX

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*– నా మొట్టమొదటి కథ విభాగంలో - బహుమతి పొందిన కథ*

*(కొత్త బేతాళకథ)*

పట్టువదలని విక్రమార్కుడు ఎప్పటిలా చెట్టుపై వేళ్ళాడుతున్న శవాన్ని దించి భుజంమ్మీద వేసుకుని శ్మశానం కేసి నడవసాగాడు. అప్పుడు శవంలోని భేతాళుడు, రాజా.." అంటూ తన అలవాటు ప్రకారం ఇంకేదో చెప్పబోయాడు.

విక్రమార్కుడు నడక ఆపి, "భేతాళా, ప్రతిసారీ నువ్వే కథలు చెప్పి నన్ను ప్రశ్న అడగడమూ, నేను సమాధానం చెప్పగానే తుర్రుమని ఉడాయించడమూ చేస్తున్నావు. ఈ ఒక్కసారి నన్ను ముందర మాట్లాడనియ్యరాదూ?" అంటూ ప్రాధేయపడ్డాడు.

ఏ కళనున్నాడో ఏమో, భేతాళుడు "సరే ఈసారికి ఇలాగే కానిద్దాము. ఏం చెప్పదల్చుకున్నావు?" అని అడిగాడు.

"తల్లికాకి - పిల్లకాకి" కథ ఎప్పుడైనా విన్నావా?" ప్రశ్నించాడు విక్రమార్కుడు.

"ఎప్పుడో విన్నట్టు జ్ఞాపకం, ఎన్ని కథలని గుర్తుపెట్టుకునేది? నీకు తెలిస్తే చెప్పు మరి. అయితే, కథ తప్ప ఇంకేమీ చెప్పకూడదు సుమా! అసందర్భమైన కబుర్లు చెప్పడం మొదలెడితే నేను మళ్ళీ మాయమైపోతాను" అని హెచ్చరించాడు భేతాళుడు.

"హమ్మయ్య, ఇంతకాలానికి నీకు నేను కథ చెప్పే అవకాశం చిక్కింది. ఇన్ని కథలు చెప్పి నా దుంప తెంచినందుకు ప్రతీకారం తీర్చుకుంటాను" అని మనసులో అనుకుంటూ విక్రమార్క మహారాజు ఇలా చెప్పసాగాడు.

●●●

బల్కంపేట అనే ఊరిమీదికి ప్రక్క ఊరి రాజు సైన్యంతో దాడి చేసి ఆక్రమించాడు. కొంతకాలం తరువాత బల్కం పేట ప్రజలు సంఘటితమై శత్రువులను వెళ్ళగొట్టగలిగారు.

"మన స్వతంత్ర పోరాటంలో ప్రధాన పాత్ర వహించిన రావుగారికి కిరీటం వేసి సింహాసనం మీద కూర్చోబెడదాము. కొన్నేళ్ళ తరువాత మన రాజ్యం పరిస్థితిని బట్టి ఇంకొకర్ని ఎంపిక చేద్దాం" అని ఊరి పెద్దలందరూ కూడబలుక్కుని నిర్ణయించారు. ఈ విధంగా బల్కంపేట నగరంలో ఒకరకమైన ప్రజాస్వామ్యానికి పునాది ఏర్పడింది.

రావుగారు ఊరి ప్రజల్లోనే పదిమందిని తనకు సలహాదారులుగా ఎంచుకున్నారు. ఆయన పాలనలో బల్కంపేట కొద్దో గొప్పో బాగుపడిందనే చెప్పాలి. రాజ్యంలో ఆస్తులు పెంచుకున్న వారికంటె బికారులైన వారి సంఖ్య తక్కువే. రావుగారి ప్రణాళికల వలన వ్యవసాయంలోనూ, వాణిజ్యంలోనూ ఊరు బాగా అభివృద్ధి చెందింది.

కళలకు కూడా చుట్టుప్రక్కల గ్రామాల్లో బల్కంపేట ప్రసిద్ధి చెందింది, ముఖ్యంగా రంగస్థల ప్రదర్శనల్లో. అందులో సుబ్బయ్య నటనంటే ప్రేక్షకులు ఎగబడి మరీ చూసేవారు.

రావుగారూ, సుబ్బయ్యా తమ తమ పనులలో నిమగ్నులై వృత్తికీ, తమ సామర్ధ్యానికీ న్యాయం చేకూర్చడానికి శాయశక్తులా పని చేసారు. తమ ప్రావీణ్యత మూలంగా కీర్తిగడించారు; దానితో పాటుగా ఎంతో ధనాన్నార్జించారు. తద్వారా సుబ్బయ్య రావుగారికి మంచి మిత్రుడయ్యాడు. చిన్న మొక్కలుగా మొదలైన వారు అతి తక్కువ సమయంలోనే ఆయా రంగాల్లో మహావృక్షాలైపోయారు.

ఊరి ప్రజలంతా ఐదేళ్ళ తరువాత సమావేశమై ఆ కాలంలో తమ ఊరు సాధించిన మంచి చెడులను బేరీజు వేసారు. వాటిని ఏకరువు పెట్టి, "అన్నీ లెక్క కట్టగా ఊరి పరిస్థితి ఎంతో మెరుగు పడిందనే చెప్పాలి. రావుగారు చేస్తున్న మంచి పనులన్నీ ఊరికి మేలు చేకూర్చాయని తేలింది. కాబట్టి రావుగారే మరొక ఐదేళ్ళ పాటు రాజుగా ఉండాలి", అని నిర్ణయించారు.

కొంతకాలానికి రావుగారికి సలహాదారులతో అభిప్రాయభేదాలు రాగా, వారిని తొలగించి తమ బంధు, మిత్రులను వారి స్థానంలో ఉంచారు. "మంత్రి" అని వారి పదవికి నామకరణం కూడా చేసారు.

రావుగారిని కాదంటే తమ మంత్రి పదవులు పోతాయేమోనని భయపడి వారు తాన అంటే వీరు తందాన అనేవారు. మరి కొంతకాలానికి వారంతా కూడా ఎంతో ధనం గడించారు. వచ్చే ఎన్నికల్లో పదవి పోకుండా ఊరి పెద్దల్లో ముఖ్యుల్ని ద్రవ్యాశ చూపి తమవైపు తిప్పుకున్నారు.

మొత్తానికి సామ, దాన భేదోపాయాలతో తమ అధికారానికి పటిష్టత ఏర్పర్చుకున్నారు. అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయాసలో క్రమంగా తమ ప్రజాసేవా కర్తవ్యాన్ని విస్మరించసాగారు.

అదే త్రోవలో నడిచి సుబ్బయ్యగారు కూడా నాటక రంగంలో మకుటం లేని మహారాజులైపోయారు. రంగస్థలంలోకి ఎవరైనా రావాలంటే ఆయన ఆశీర్వాదమూ, ప్రోత్సాహమూ లేనిది ప్రవేశం దొరికేది కాదు. రావుగారి సాంగత్యం ఉండడంతో సుబ్బయ్యగారి పలుకుబడి మరింత పెరిగింది. ఆయన గీసిన గీత దాటినవారికి ఆ రంగంలో పుట్టగతులుండేవి కావు; వారు వేరే వృత్తిని చేపట్టడమో లేక ఉన్న ఊరిని వదిలి వేరే చోటికి వెళ్ళడమో చెయ్యాల్సి వచ్చేది.

వారిద్దరికీ చెరొక వంశోద్ధారకుడూ ఉద్భవించాడు. తండ్రుల నేస్తం కారణంగా వీరు కలిసి పెరిగారు. ఆర్థిక స్తోమత, రాచరికపు సాన్నిహిత్యం వలన క్రమంగా వీరిలో గర్వం పాలు కొంత, పొగరు పాలు మరి కొంత పెరుగుతూ వచ్చాయి. యుక్తవయస్కులయ్యేసరికి తాము చెప్పిందే జరగాలనేవారు; జరక్కపోతే దౌర్జన్యానిక్కూడా వెనుకాడని పట్టుదల అలవర్చుకున్నారు.

ప్రజ్ఞ ఉన్నా లేకపోయినా తండ్రుల తరువాత తామే ఆయా రంగాలకు వారసులమనే భావన వారిలో నాటుకుంది. వేరే విద్యలేమీ నేర్వకపోవడం వలన రావుగారబ్బాయి యువరాజుగా నియమించబడ్డాడు, సుబ్బయ్యగారబ్బాయి నటనా కౌశల్యం లేకపోయినా నాటకాలలో ప్రధాన పాత్రలను పోషించసాగాడు.

కొన్నేళ్ళకు తండ్రులు ఇద్దరూ కాలం చేసారు.

మరణించే ముందు తమ కొడుకులను పిలిచి అధికారంలో ఉన్నప్పుడు తాము చేసిన దుశ్చర్యల జాబితా చెప్పారు. "మేము చేసిన పనులవల్ల మాకొచ్చిన చెడ్డపేరు పోయే మార్గం ఆలోచించి, పుత్రులుగా మా పట్ల మీ ధర్మాన్ని నిర్వర్తించండి" అని హితబోధ చేసి వారు కన్నుమూసారు.

యువరాజు పదవి నుండి ఎదిగి రాజైనాక రావుగారబ్బాయిలోని నిరంకుశత్వమూ, స్వార్థమూ, పరహింస పరాయణత్వమూ విపరీతంగా పెరిగిపోయాయి. సుబ్బయ్యగారబ్బాయితో కలిసి బల్కంపేటని ఇష్టం వచ్చినట్లుగా ఏలసాగాడు. క్రమేణా ప్రజల్లో వారిపట్ల ద్వేషం పెరిగింది. అలాగని ఎవరైనా అడ్డం వస్తే వారిని నిర్దాక్షిణ్యంగా దండించసాగారు. తమ పదవులకూ, అధికారానికీ ఏ మాత్రం ప్రమాదం రాకుండా చేసుకున్నారు.

ఒకనాడు వారి తల్లులు ఇద్దరినీ పిలిచి వారు చేస్తున్న తప్పుడు పనులను ఆపమని అడిగారు.

వారు ఏకకంఠంతో, "మేము మా నాన్నగారి ఆఖరి కోరికను తీరుస్తున్నాం. వారికి మంచి పేరు తెచ్చి వారి కీర్తిని పదింతలు చేసే ప్రయత్నమే మాది" అని విసురుగా అక్కడినుండి వెళ్ళిపోయారు.

తల్లులు అవాక్కై చూస్తూ ఉండిపోయారు, వీళ్ళను పదవుల్లోంచి తొందరగా తీసివెయ్యకపోతే తమ బల్కంపేట రాజ్యానికి అధోగతి తప్పదని తలుస్తూ.

●●●

విక్రమార్కుడు కథను ఇక్కడితో ఆపి మౌనం వహించాడు.

ఉత్సుకతను ఆపుకోలేని భేతాళుడు కొంతసేపాగి, "రాజా, ఈ కథ బాగుంది గానీ, వారి తండ్రులు పుత్రధర్మాన్ని నిర్వర్తించమంటే వారు ఊరిని కొల్లగొడుతూ కూడా తండ్రులు ఆదేశించిన పని మీదే తాము ఉన్నామని ఎందుకు చెప్పారు? ఇకపోతే, మొదట్లో నాకు "తల్లికాకి, పిల్లకాకి" కథ చెబుతానన్నావు కదా, మరి అది చెప్పకుండా బల్కంపేటలోని ఈ ధూర్తుల కథ ఎందుకు చెప్పినట్టు? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసీ నాకు చెప్పకపోయినా, లేక మాట మార్చినా, నీ తల వేయి ముక్కలవుతుంది" అన్నాడు.

అప్పుడు విక్రమార్కుడు, "భేతాళా, 'తల్లికాకి, పిల్లకాకి' కథ ఇప్పుడు చెబుతాను, విను.

ఒక కాకి చెట్టుకొమ్మపై కూర్చుని క్రింద వీధిలో నుంచున్న మనుషులపై రెట్ట వేసేది.

వెంటనే వారు, "ఈ కాకి నాశనమైపోను" అని కాకిని చెడామడా తిట్టి శాపాలు పెట్టేవారు.

తలమీదా, బట్టలమీదాపడ్డ అశుద్ధాన్ని వదిలించుకోవడానికి వారు పడే కష్టాలు చూసి కాకి అమితంగా ఆనందపడేది.

వృద్ధాప్యం వచ్చి మరణం ఆసన్నమైనప్పుడు ఆ కాకి తన కూతుర్ని పిలిచి, "నేను బ్రతికున్నంత కాలమూ పాపపు పనులు చేస్తూ వచ్చాను. అమాయకులైన వారి మీద రెట్టలు వేసి వారి శాపనార్థాలకు గురి అయ్యాను. అందువల్ల నాకు ఈ లోకంలో ఎంతో చెడ్డపేరు వచ్చింది. ఘోరనరకాలకు వెళతానేమోనని భయంగా ఉంది. నా ఆఖరి కోరికగా నువు నాకు మంచి పేరు వచ్చేలా ప్రవర్తించు", అని చెప్పి కన్నుమీసింది.

మర్నాటి నుండి పిల్లకాకి అదే చెట్టుకొమ్మపై కూర్చుని క్రింద ఎవరైనా వస్తారని ఎదురు చూసేది. మనిషి రాగానే "కావు కావు" మని అరిచేది.

ఆ కాకిగోల విని, "ఎప్పుడూ లేనిది ఈ కాకి ఇప్పుడు అరిచిందేమిటా", అని వాళ్ళు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టుకుని పైకి చూసేవారు. అప్పుడు పిల్లకాకి సూటిగా వారి నోటిలో పడేట్టుగా రెట్టవేసేది.

"ఈ దరిద్రపు కాకి కన్న దీని తల్లే నయం, కేవల ఒంటి మీద రెట్ట వేసేది. ఇది పిలిచి మరీ నోట్లో వేసింది" అని పిల్లకాకిని తిట్టుకుంటూ ఆ మనుషులు వెళ్ళిపోయేవారు.

అది విని పిల్లకాకి తన కారణంగా తల్లికి మంచి పేరు వచ్చినందుకు ఎంతో సంతోషంచేది.

భేతాళా, ఇదే 'తల్లికాకి' కథ.

రావుగారు, సుబ్బయ్యగార్ల పిల్లల పుత్రధర్మం గురించిన ప్రశ్నకు కూడా నీకు ఈ కథలోనే సమాధానం దొరికిందనుకుంటాను?" అంటూ విక్రమార్కుడు భేతాళుణ్ణి ప్రశ్నించాడు.

అయితే, కథ పూర్తయిన తరువాత ఇలా రాజుకు మౌనభంగం అవగానే భేతాళుడు శవంతో సహా ఎగిరిపోయి తిరిగి చెట్టెక్కి కూర్చున్నాడు.

తనను ఇరకాటంలో పెట్టి, తల పగుల్తుందని బెదిరించి తనచేత మాట్లాడించిన భేతాళుడి తెలివికి విసుక్కుంటూ విక్రమార్కుడు మళ్ళీ చెట్టు వద్దకు నడవసాగాడు.

(కల్పితం)

●●●

Click here to share your comments on this story